హైదరాబాద్ వార్త



## మలక్ పేట మెట్రో స్టేషన్ పార్కింగ్ వద్ద ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం

### -కాలిపోయిన 5 ద్విచక్ర వాహనాలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**మలక్ పేట ,డిసెంబరు 6, ప్రభాతవార్త:** మలక్ పేట మెట్రో స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి ఐదు ద్విచక్ర వాహనాలు కాలిపోయిన సంఘటన చాదర్ఘా పోలీసులు జరిగింది పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం సాయంత్రం మలక్పేట మెట్రో స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి చాదర్ ఘాట్ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని మాంటలు ఆర్పి వేశారు. అగ్నిప్రమాదం మూలంగా మెట్రో స్టేషన్ పార్కింగ్ లో ఉన్న 5 ద్విచక్ర వాహనాలు దగ్ధం అయ్యాయని పోలీసులు తెలిపారు. సంఘటన ప్రాంతానికి ఇన్స్ స్పెక్టర్ క్టర్ రాజు, ఎస్ ఐ తిరుపతి, సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు . అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదని పోలీసులు తెలిపారు. అగ్నిప్రమాదం సంభవించడంతో దట్టమైన పొగలు వ్యాపించడంతోపాటు కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సాగర తీరాన "విజయోత్సవ సంబురాలు "

### -నేటి నుంచి మూడురోజులపాటు నిర్వాహణ -హుస్సేన్‌సాగర్ చుట్టూ 150 స్టాళ్ల ఏర్పాటు

### -తెలంగాణ రుచులు, సంస్కృతి ప్రతిభించిచేలా ప్రదర్శనలు -డ్రోన్, లేజర్,క్రాకర్స్ షో...ప్రముఖ సింగర్స్‌చే మ్యూజికల్ నైట్





**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** ప్రజాపాలన విజయోత్స వాలలో భాగంగా నేటి నుంచి మూడు రోజులపాటు హుస్సే న్‌సాగర్ తీర ప్రాంతమంతా సందడిగా మార నుంది. ముగింపు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో 7,8,9 తేదీలలో ఇక్కడ వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే హుస్సే న్ సాగర్ చుట్టూ వివిధ శాఖలకు చెందిన 150స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్స వాల చివరి మూడు రోజుల్లో సచివాలయ ప్రాంగణంలో తెలంగాణా తల్లి విగ్రహావిష్కరణ తోపాటు మూడు రోజుల పాటు సినీ రంగ ప్రముఖులచే మ్యూజికల్ నైట్, నగరంలోని ప్రముఖ హోటళ్లు, డ్వాక్రా, రెస్టారెంట్లు, సంస్థలచే స్టాళ్ళ ఏర్పాటు, భారీ ఎత్తున డ్రోన్ షో, లేజర్ షో, క్రాకర్స్ షో తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డిసెంబర్ 7 వ తేదీన వందే మాతరం శ్రీనివాస్ బృందం, 8 వ తేదీన రాహుల్ సిప్లిగంజ్, 9 వ తేదీన థమన్ చే మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేస్తున్నారు.అలాగే . తెలుగు తల్లి ఫ్లై ఓవర్ నుండి పీవీ మార్గ్ వరకు ఐదు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికల్లో భిన్న రీతుల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇదే మార్గంలో తెలంగాణ రుచులు, సంస్కృతి ప్రతిబింబించేలా ఫుడ్ స్టాళ్లు, హస్తకళ స్టాళ్లు, పలు శాఖల స్టాళ్లతో ఏర్పాటు చేస్తున్నారు. యువత కోసం సెల్ఫీ పాయింట్, ట్యాంక్ బండ్ నుండి రాజీవ్ గాంధీ జంక్షన్, సచివాలయం, ఇందిరా గాంధీ ఐమాక్స్ జంక్షన్ నుండి పీవీ నర్సింహా రావు మార్గ్ వరకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.వాస్తవానికి గతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసేవారు. కానీ ప్రజాపాలన ఉత్స వాలకు మాత్రమే జీహెచ్ఎంసీనే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు కార్నివాల్ పూర్తయ్యే వరకు హుస్సే న్ సాగర్ చుట్టూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. అలాగే ఈనెల 9వ తేదిన సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మందిని సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం గ్రేటర్ లోని స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను తీసుకురావాలని జీహెచ్ఎంసీ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. మూడు రోజులపాటు జరిగే కార్నివాల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ, చేనేత, జౌళి శాఖ, వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, క్రీడాశాఖ, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించడానికి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ను కూడా ఏర్పాటు చేశారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.





## హుస్సేన్ సాగర్ వద్ద ఘనంగా ఎయిర్ షో రిహార్సల్స్..

రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఎయిర్ షో నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం హుస్సేన్ సాగర్ వద్ద ఎయిర్ షో రిహార్సల్స్ చేశారు. దీంతో హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లోని తెలుగు తల్లి ఫ్లైఓవర్, సెక్రటేరియట్ తదితర ప్రాంతాల్లో వాహనదారులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



## తరగతిగదితోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉంది

**-పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి**

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

**హైదరాబాద్, డిసెంబరు 6,ప్రభాతవార్త:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.శుక్రవారం ముషీరాబాద్ రాంనగర్ సెయింట్ పైస్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ముఖ్యతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ లేని జీవనం ఊహించుకోలేనిదని మన మందరం సైన్స్ లో జరిగే సాంకేతిక పరిణామల వల్ల ఈ విధమైన జీవనం గడుపుతున్నామని అన్నారు. మనం కూర్చునే కుర్చీ, గాలి కోసం వాడే ఫ్యాన్, ధ్వని కోసం వాడే మైకులని కూడా సైన్స్ వల్లనే వచ్చాయాని అన్నారు. పెన్సులిన్ కనిపెట్టిన అలగ్జాండర్ ఫ్లెమింగ్ అలాగే యాపిల్ చెట్టు నుండి కాయ కింద పడడం చూసిన న్యూటన్ గొప్ప శాస్త్రవేత్తగా చేసే మూల కారణం అని వారి సేవలను ఈ సందర్భంగ కొనియాడారు. విద్యార్థులు సృజనాత్మకత నైపుణ్యంను పెంపొందించుకోవాలని అలాగే వినూత్నమైన ఆలోచనలతో ప్రతి ఒక్కరు అలోచించి తమ భావి జీవితానికి పునాదులు వేసుకోవాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలు ఇందుకు ఒక చక్కని వేదిక గా వాడుకొని విద్యార్థులందరు ఆధునిక శాస్త్రవేత్తలుగా సమాజానికి ఉపయోగపడే పౌరులవ్వాలని ఆకాంక్షించారు. తదుపరి వైజ్ఞానిక ప్రదర్శనశాలను ప్రారంభించి, బాల, బాలికలు చేపట్టిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి అభినదించారు. ఈఎగ్జిబిషన్‌లో 6 నుండి 10 వ తరగతి చదువుతున్న 78 పాఠశాలల విద్యార్థులచే 147 వైజ్ఞానిక పదర్శనలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రోహిణి, డిప్యూటీ డిఈఓ చిరంజీవి, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిండా జరాల్డ్, కోర్డినేటర్ జ్యోతి, తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని స్టోర్‌రూంలో పేలుడు

### -చెత్తకు నిప్పుపెడుతుండగా ఘటన

### - ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి గాయాలు



పేలుడు కారణంగా ధ్వంసమైన స్టోర్‌రూం రేకులు

**హయత్‌నగర్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని స్టోర్‌రూంలో శుక్రవారం ఉదయం భారీ శబ్ధంతో పేలుడు సంభవించింది. సంఘటనలో సూర్యకళ అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు... హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి అవసరం లేని వస్తువులు, సీజ్‌చేసిన వస్తువులు, పాతరికార్డులను స్టేషన్ ఆవరణలో రేకులతో ఏర్పాటు చేసిన స్టోర్‌రూంలో భద్రపరుస్తుంటారు. శుక్రవారం ఉదయం దాదాపు 10.15 గంటల సమయంలో సూర్యకళ రోజువారిగా పోలీస్‌స్టేషన్ ఆవరణను శుభ్రపరుస్తూ స్టోరూం వెనుకవైపు చెత్తను తొలగించడం ప్రారంభించింది. ఈక్రమంలో చిన్నచిన్న కర్రలు, చెత్తచెదారాన్ని ఒకదగ్గర వేసి దానికి నిప్పంటించింది. వెంటనే పెద్ద శబ్ధంతో పేలుడు సంభవించింది. స్టోర్ రూం రేకులు పైకిలేచాయి. సంఘటనలో సూర్యకళ ముఖంపై ఎడమకంటి పైభాగంలో గాయాలయ్యాయి. భారీ శబ్ధంతో ఉల్లిక్కిపడిన పోలీసులు వెంటనే తేరుకుని ఆమెను చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం క్షేమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ మాట్లాడుతూ... చెత్తకు నిప్పు పెట్టిన సమయంలో స్టోర్‌రూంలో ఉన్న టైరు పేలడంతో భారీ శబ్ధం వచ్చిందని స్టోర్‌రూం రేకులు ధ్వంసమయ్యాయని తెలిపారు. సూర్యకళను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించిన తరువాత ఇంటికి పంపించినట్లు వివరించారు.

**పేలుడు పదార్థాల కారణంగానేనా...**

ఓవైపు టైరు పేలి భారీ శబ్ధం వచ్చిందని పోలీసులు చెబుతున్నప్పటికీ స్టోర్‌రూంలో పేలుడు పదార్థాలేమైనా ఉన్నాయా... చెత్తకు నిప్పుపెట్టినపుడు ఆ వేడికి పేలుడు పదార్థాలు విస్ఫోటనం చెంది భారీ శబ్ధం వచ్చిందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో సీజ్‌చేసిన సిలిండర్లు, రంగుడబ్బాలు, జిలిటెన్ స్టిక్స్ వంటివి స్టోర్‌రూంలో నిల్వచేయడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందన్న అభిప్రాయాలు కూడా విన్పిస్తున్నాయి. భారీ శబ్ధంతో తమ దుకాణాలలోవస్తువులు కూడా కదిలాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ఏదేమైనా స్టోర్ రూం వెనుకే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా... ఎలాంటి ఆస్థి, ప్రాణ నష్టం సంభవించపోవడం అదృష్టంగా చెప్పవచ్చు.




పేలుడుతో పడిపోయిన ద్విచక్రవాహనం

## ప్రజావాణిలో ఫిర్యాదుతో టెంట్ హౌస్‌కి రుణం

### -చిన్నారెడ్డి,దివ్యలకు కృతజ్ఞతలు తెలిపిన లబ్దిదారుడు



ప్రజావాణీ ద్వారా టెంట్ హౌస్ వచ్చిన లబ్దిదారుడు బాణాల రమేష్‌కు స్వీట్ తినిపిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి,ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్యలు.

**బేగంపేట డిశంబరు 6,ప్రభాతవార్త** ప్రజావాణీలో తనకు బ్యాంకులు రుణం మంజూరు చేయడం లేదంటూ దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుడికి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి,చిన్నారెడ్డి,ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ లు బ్యాంకర్లతో మాట్లాడి లైన్ క్లియర్ చేయడంతో ఆ లబ్దిదారుడికి బ్యాంకు రుణం మంజూరైంది.దీంతో అతను శుక్రవారం ప్రజావాణీకి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి,ప్రజా పాలన ప్రత్యేక అదికారి దివ్యా దేవరాజన్‌లకు కృతజ్ఞతలు తెలియజేసారు.జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన బాణాల రమేష్ కు టెంట్ హౌస్ దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు.అయితే అతనికి రుణం ఇచ్చేందుకు బ్యాకర్ అయిష్టత చూపారు.ఎస్సీ కార్పోరేషన్ సబ్సిడీ మంజూరు అయినప్పటకీ సిబిల్ స్కోర్ సరిగా లేదన్న కారణంతో పాటు రమేష్ బ్యాంకుకు కొంత అప్పు ఉండటంతో వారు నిరాకరించారు.దీంతో రమేష్ అక్టోబరు నెలలో ఈ విషయాన్ని వివరిస్తూ ప్రజావాణీలో దరఖాస్తు చేసుకున్నారు.ప్రజావాణీ అధికారులు బ్యాంకర్‌తో మాట్లాడి రమేష్‌కు రుణం ఇప్పించారు.ఈ సందర్భంగా లబ్దిదారుడు రమేష్ శుక్రవారం ప్రజావాణీలో డా.చిన్నారెడ్డి.దివ్యలను కల్సి కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సందర్భంగా వారిరువురు రమేష్ కు స్వీటు తినిపించి అబినందనలు తెలియజేసారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,చిన్నారెడ్డి,దివ్యలకు కృతజ్ఞతలు తెలియజేసారు.టెంట్‌హౌస్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధికి మార్గం దొరికిందని,ఆదాయంతో కుటుంబ పోషణ సామాజిక కార్యక్రమాలకు బాటలు వేసిందని రమేష్ సంతోషం వ్యక్తం చేసారు.

## సంధ్య థియేటర్ ఘటనపై విచారణకు స్వీకరించిన జాతీయ మానవ హక్కుల కమిషన్




**హైదరాబాద్, డిసెంబరు 6 , ప్రభాతవార్త** పుష్ప 2 ప్రీమియం షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్లో జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ కు అందిన ఫిర్యాదును విచారణకు స్వీకరించింది. న్యాయవాది రామారావు ఇమ్మినేని, కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. పుష్ప 2 ప్రీమియం షో చూసేందుకు అల్లు అర్జున్, కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సంధ్యా థియేటర్ వద్దకుతన వ్యక్తిగత భద్రతా సిబ్బందితో చేరుకున్నారు. అల్లు అర్జున్ లోపలికి వెళ్లిన సమయంలో భద్రతా సిబ్బంది ప్రేక్షకులను నెట్టి వేయడం ప్రారంభించగా, అప్పటికే థియేటర్ లోపలా, బయటా కిక్కిరిసిపోయి ఉన్న అభిమానులు ఆయనను చూసేందుకు ప్రయత్నించడంతో తోపులాట చోటు చేసుకుంది. ఆ సమయంలో ఆగుంపులో ఉన్న రేవతి, ఆమె కుమారుడు శ్రీతేజ తొక్కిసలాటలో గాయపడగా అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది వారిని బయటకు లాగి, ఆమె కుమారుడికి సీపీఆర్ చేసి, ఆస్పత్రికి తరలించారు. రేవతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు 105, 118 (1) రెడ్ విత్ 3(5) బీ.ఎన్.ఎస్.కింద సంధ్య థియేటర్ యాజమాన్యంతో పాటు అల్లు అర్జున్ పైన, ఆయన సెక్యూరిటీ టీమ్ పైనా కేసులు నమోదు చేశారు. ఇప్పుడు ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణకు స్వీకరించడంతో ఈ వివాదం మరింత ఆసక్తికరంగా మారింది. ?

**అల్లు అర్జున్ థియేటర్‌కి రావడం వల్లే నా భార్య చనిపోయింది**

**: రేవతి భర్త భాస్కర్ సంచలన వ్యాఖ్యలు...**

అల్లు అర్జున్ థియేటర్‌కి రావడం వల్లే నా భార్య చనిపోయింది, నా కొడుకు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని రేవతి భర్త భాస్కర్ సంచలన వ్యాఖ్యలు చేసారు. అల్లు అర్జున్ రాకపోయి ఉంటె అంత క్రౌడ్ ఉండేది కాదని, నా శ్రీతేజ్ నెల రోజుల నుంచి బలవంతం చేస్తేనే తామంతా ప్రీమియర్ షోకి తీసుకెళ్ళామని అన్నారు.తన కుమారుడు నెల రోజుల ముందు నుంచి పుష్ప2 సినిమాకు వెళదామని బలవంతం చేయడంతోనే తాను ఆ రోజు ప్రీమియర్ షోకి తీసుకెళ్లాన్నారు. అల్లు అర్జున్ అంటే వీరాభిమానం అన్నారు. ఆయన పాటలు, డైలాగులు చెబుతూ ఎల్లప్పుడూ చాలా యాక్టివ్‌గా ఉండేవాడని తెలిపారు. ఆ రోజు థియేటర్‌లో ఎంజాయ్ చేద్దాం డాడీ అని పేపర్లు కూడా ముందే కట్ చేసి పెట్టుకున్నాడని తండ్రి భాస్కర్ రోదిస్తూ వివరించారు.

**విషమంగానే శ్రీతేజ్ పరిస్థితి...**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్‌కు కిమ్స్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స చేస్తున్నారు. అతడి ఆరోగ్య పరిస్థితి ఇంకా ఆందోళనకరంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆస్పత్రికి తీసుకువచ్చేసరికి శ్రీతేజ్ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడని.. దీంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేస్తున్నామని వైద్యులు వెల్లడించారు. బాలుడి మెదడు, వెన్ను భాగాలకు సీటీ స్కాన్ చేశామని, అవి సాధారణ స్థితిలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

## ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని హోటల్లో చికెన్ బిర్యానీలో ట్యాబ్లెట్లు..!



**హైదరాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త** నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో కలుషిత ఆహారం వడ్డిస్తున్నట్టు ఇప్పటికే పలుమార్లు గుర్తించారు. అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొన్ని రెస్టారెంట్ల తీరు మారడంలేదు. తాజాగా, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న ఒక హోటల్ లో చికెన్ బిర్యానీలో శుక్రవారం ట్యాబ్లెట్లు దర్శనమిచ్చాయి. దాంతో కస్టమర్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కస్టమర్లు, బిర్యానీలో ట్యాబ్లెట్లు ఉన్నదాన్ని వీడియో తీసే ప్రయత్నం చేయగా హోటల్ యాజమాన్యం అడ్డుకుంది. దాంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఇదే హోటల్ లో ఇటీవల బిర్యానీలో సిగరెట్ పీకలు, బొద్దింకలు, ఇతర పురుగులు దర్శనమిచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు బిర్యానీలో మాత్రలు కనిపించగా, అధికారులు చర్యలు తీసుకోవాలని కస్టమర్లు కోరుతున్నారు. గత ఆర్నెల్ల కాలంలో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికా రులు నగరంలోని రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు జరిపి కొన్ని చోట్ల కేసులు నమోదు చేశారు. కొన్ని రెస్టారెంట్లకు జరిమానాలు కూడా విధించారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ అభివృద్ధికి కృషి చేస్తాం



ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్,కార్పోరేటర్ కొంతం దీపిక,ప్రిన్సిపాల్ వినోద్ తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 6 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్‌లో మౌళిక సదుపాయాలు మెరుగు పర్చేందుకు తనవంతు కృషి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం మారేడ్‌పల్లిలోని ప్రభుత్వపాలి టెక్నిక్ కళాశాలలో రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పవర్‌బోర్ వెల్ పనులను మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, ప్రిన్సిపాల్ కె.వినోద్ కుమార్,నర్సయ్య గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకి రవిందర్, వైష్ణవి, సంతోష్ యాదవ్, ముప్పిడి మధుకర్, నాగినేని సరిత, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

## పుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదు: దేవేందర్

**కంటోన్మెంట్,డిసెంబర్ 6 ప్రభాతవార్త:** పుత్‌పాత్‌లపై అ క్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా సహించేది లేదని ట్రాఫిక్ డిసిపి రాహుల్ ఎగ్దే, కంటోన్మెంట్ బోర్డు శానిటరీ సూపరిండెంట్ ఎం.దేవేందర్‌లు హెచ్చరించారు. లోతుకుంట ఆర్.పి.నిలయం పరిసర ప్రాంతాల్లోని పుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం ట్రాఫిక్, కంటోన్మెంట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో తొలగించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు, తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ బాబు తది తరులు పాల్గొన్నారు.

### అణగారిన వర్గాలపై జరుగుతున్న దోపిడీ, హింసలను తుదముట్టించాలి




లీగల్ క్లినిక్ కార్యక్రమంలో మాట్లాడుతున్న దివ్యాదేవరాజన్

**సైఫాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో సైఫాబాద్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో శుక్రవారం దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరుగుతున్న హింసపై 'లీగల్ క్లినిక్' అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దళిత స్త్రీశక్తి కన్వీన ర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సెర్ప్ సిఇఒ, నోడల్ అధికారి దివ్యాదేవరాజన్ మాట్లాడుతూ ఈ లీగల్ క్లినిక్ ప్రవేశపెట్టిన 40 మంది కేసులను ఒకే సారి ప్రత్యేక ప్రజావా ణిని ఏర్పాటు చేసి అన్ని శాఖలతో సమన్వయపరుస్తామన్నారు. సంస్థపరమైన అన్ని అంశాలను మనమే పరిష్కరించుకోగలమని, కోర్టుల్లో జాప్యాలను ప్రత్యేక దృష్టితో చూడాలన్నారు. స్త్రీలపై ప్రత్యేకంగా అణగారిన వర్గాలపై జరుగుతున్న దోపిడీలను, హిం సలను తుదముట్టించాలని ఆమె పిలుపునిచ్చారు. దళిత ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరిగిన హింసా సంఘటనలను తరువాత జరిగిన వ్యవస్థాపరమైన జాప్యాలను జ్యూరికి వివరించడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులుగా వివిధ శాఖల అధికా రులు పాల్గొని మాట్లాడారు.

## నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆటో బంద్

**సైఫాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారం కోసం ప్రభుత్వం నుంచి చర్చలకు ఏలాంటి ఆహ్వానం రానందున ఈ నెల 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆటో బంద్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆటో సంఘాల జెఏసి తెలిపింది. ఈ మేరకు శుక్రవారం జెఏసి నాయకులు ఎఐటియుసి భవన్‌లో సమావేశమై ఆటో బంద్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరం గా విఫలం చెందిందని జెఏసి నాయకులు ఆరోపించారు.

### వెలమ సామాజికవర్గానికి ఎమ్మెల్యే శంకర్ క్షమాపణలు చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్‌రావు

**సైఫాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరవల్లి శంకర్ 24 గంటలలో క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఆయన ఇంటిని ముట్టడిస్తామని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నిలగిరి దివాకర్‌రావు, కోశాధికారి సి.హెచ్, హరీష్ రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ షాద్‌నగర్‌లో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని వెలమ కులస్తులను తరిమికొడతా మని, అంతు చూస్తానని బెదిరించడం దారుణమన్నారు. ఈ మేర కు ఆయనపైన దోమల్‌గూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై విచారణ జరిపి చట్టపరమై న చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో అసోసియేషన్ సభ్యులు కె.నరేందర్‌రావు, వి. కిషన్‌రావు, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

### : కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త**

హౌస్ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని గోల్నాక డివిజన్ కార్పొరే టర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఉద యం కార్పొరేటర్ ఇంటి వద్ద కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ లను నల్లకుంట పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టుకు నిరసనగా ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపడానికి పార్టీ పిలుపునిచ్చిం ది. దీంతో ఎక్కడికక్కడ నాయకులను హౌస్ అరెస్టు చేశారు.



నగరంలో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## నేటి రాష్ట్రవ్యాప్త ఆటో బంద్‌కు ఐఎన్‌టియూసీ ఆటో యూనియన్ దూరం

**ముషీరాబాద్, డిసెంబర్ 6, ప్రభాతవార్త:**

శనివారం జరగబోయే రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్‌లో ఐఎన్‌టి యూసీ ఆటో యూనియన్ పాల్గొనటం లేదని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టి యూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్, గ్రేటర్ అధ్యక్షులు శాబంకర్ దయానంద్‌లు స్పష్టం చేశారు. శుక్రవా రం నారాయణగూడలోని ఐఎన్‌టియూసీ ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొ న్నం ప్రభాకర్, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కిగౌడ్‌లకు తమ యూనియన్ వినతిపత్రం సమర్పించిందని, త్వరలోనే అన్ని ఆటో యూనియన్ల నాయకులతో రౌండ్ టేబుల్ సమా వేశం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపా రు. అదే విధంగా నేడు రవీంద్రభారతిలో జరిగే ఐఎన్‌టి యూసీ ఆటో యూనియన్ రాష్ట్ర స్థాయి సదస్సులో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టిపిసి సి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు పాల్గొ నే సదస్సులో ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జేఏసీ నాయకులు ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, కొత్త ఆటోపర్మిట్లు ఇవ్వాలని ఏ ఒక్కరోజు కూడా అడగలేదని, ఇప్పుడు ఆటో డ్రైవర్ల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు జేఏసీ నాయకులకు, బీఆర్ఎస్ పార్టీకి లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓలా, ఊబర్, రాపిడోలను ప్రోత్సహించిందని గుర్తు చేశారు. సమస్యలు పరిష్కరి స్తామని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నా ప్రతిపక్ష పార్టీల యూనియన్‌నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొ డుతున్నారని విమర్శించారు. నేడు జరిగే ఆటో బంద్‌లో ఆటో డ్రైవర్లు ఎవరూ పాల్గొన వద్దని, ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే సమస్యలు అన్నీ పరిష్కారం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఉప్పల శ్రవణ్‌కుమార్, మహేష్ దేశ్‌పాక తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్

## తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక పథకం ప్రకటించాలి

### -తెలంగాణ అడ్వకేట్ జెఏసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, డిసెంబర్ 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాధనకై అమరులైన వారి కుటుంబాలను ఆర్థిక సాయం అందించేందుకు ప్రత్యేక పథకం ప్రభుత్వ పరంగా ప్రకటిం చాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధ న్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా న్యాయవా దుల సంఘం నేతలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాజకీయ చరిత్రలో డిసెం బర్ 9కి ఎంతో విశిష్టత ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధనకై ఎందరో యువకులు అమరులవుతున్న పరిస్థితుల్లో 2009 డిసెంబర్ 9న సోనియాగాంధీ ఒక తల్లిగా స్పందించి, తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూరుతుందని తెలిసినప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు శ్రీకారం చుట్టటం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వం అమర వీరుల దీపాన్ని నిర్మించారని, అదే విధంగా ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరిస్తున్న సందర్భంలో తెలం గాణ రాష్ట్రం కోసం అమరులైన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించే విధంగా ఒక పథకాన్ని ప్రభుత్వం తరఫు న ప్రకటిస్తే అమరవీరుల కుటుంబాలు ఎంతో సంతోషి స్తారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్య మంలో పాలుపంచుకోలేదనే నెపం కూడా కొందరిలో ఉంది కాబట్టి డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భం గా కానీ, తెలుగుతల్లి విగ్రహ ప్రారంభోత్సవ సమయంలో కానీ లేదా అసెంబ్లీలో కానీ ప్రకటిస్తే బాగుంటుందని, మీ కీర్తి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వారి సహచర మంత్రులు స్పందించి, మంచి నిర్ణయం తీసుకుని అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుస్తారని తెలంగాణ ఉద్యమ న్యాయవాదులుగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా న్యా యవాదుల సంఘం అధ్యక్షులు వై.కొండల్‌రెడ్డి, ఉపాధ్య క్షులు వై.కొండల్‌రెడ్డి, కార్యదర్శి జి.కృష్ణ, రాధాకృష్ణ, కీర్తి కుమారి, మీనాక్షి, పి.సురేష్, పి.రాంచెందర్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

## నేటి నుండీ ఆదిభట్ల నారాయణదాసు జయంతి మహోత్సవాలు

**హైదరాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త**

ఆదిభట్ల నారాయణదాసు 160వ, ఆయన ప్రియ శిష్యుడు నేతి లక్ష్మీనారా యణ భాగవతుల 126వ జయంతి హరికథా మహోత్సవములు శనివారం నుండి ఈ నెల 12వ తేదీ వరకు 5 రోజులపాటు ప్రతీ రోజు సాయంత్రం 6 గంటల నుండి నల్లకుంటలోని శృంగేరి శంకరమఠం ప్రాంగణంలో జరుగుతున్నాయి. 7వ తేదీన భక్త ప్రహ్లాద వై. శిఖామణి భాగతారిణి, 8వ తేదీన భక్త మార్కండేయ జి. మునిలక్ష్మీ, 9వ తేదీన ద్రౌపదీ స్వయంవరం ఎస్. చిరంజీవాచార్యులు భాగవతులు, 10వ తేదీన భక్త అంబ రీష సప్పా భారతి భాగతారిణి, 12వ తేదీన శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం



నారాయణదాసు

బుర్రా పద్మనాభశర్మ భాగవతులు హరికథాగానములు చేస్తారు.పాణ్యం దక్షిణామూర్తి, భాగవతుల సీతాపతి రావు వయోలిన్ సహకారం; ఆర్. సుధాకర్, కే. చిదంబర నటరాజ్ కు మార్ మృదంగం మరియు జి. నట రాజ్ తబలపైన వాయిద్య సహకారం అందిస్తున్నారు.నిర్వాహకులు ఆఖరి రోజు 12వ తేదీనాడు పద్మశ్రీ అవార్డు గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరి భాగ తారిణికి ముఖ్య అతిధి శ్రీ ప్లాంజేరి శంకరనారాయణ చేతుల మీదుగా హరికథా సరస్వతి బిరుదుతో ఘనంగా సన్మానము చేస్తున్నారు. అన్నమయ్య పరివారము, నేతి కుటుంబము మరి యు ప్లాంజేరి ఫౌండేషన్ హైదరాబాద్ వారి సంయుక్త నిర్వాహణలో హరికథా మహోత్సవములు జరుపుతున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకట కృష్ణయ్య ప్రకటన తెలియచేస్తూ భక్తు లు పెద్దఎత్తున పాల్గొని కార్యక్ర మాలు దిగ్విజయం చేయాలని కోరారు.

## రాజ్యాంగనిర్మాతకు ఘన నివాళులు

**హైదరాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త**

న్యాయ కోవిదుడు, రాజనీతిజ్ఞుడు ,ఆర్థికవేత్త, అంటరానిత నం ,వివక్షలపై అలుపెరుగని పోరు చేసిన, మన భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శ్రీరమణ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్‌నేతలు పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల భవిష్యత్తును గురిం చి ఆనాడే ఆలోచించి ,మన రాజ్యాంగాన్ని నిర్మించిన గొప్ప మహానుభావుడు మనమంతా ఒక్కటేనని, అందరం సమా నులమేనని, అంటరానితనాన్ని రూపుమాపిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని, అలాంటి మహానుభావుడు ఆశయాలను మనమందరం కూడా పాటిస్తూ, మన జీవితం లో ముందుకు సాగాలని ఈ సందర్భంగా కోరుకుంటు న్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ శంబుల శ్రీకాంత్ గౌడ్ ,ఏ బ్లాక్ ప్రెసిడెంట్ కుంకుమ రాజేశ్వరరావు, డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్ గౌడ్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ స్పోక్ పర్సన్ కోటం అనిల్, కమిటీ సభ్యులు నరేందర.ప్రదీప్, కుబ్బా రావు,శ్రవణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ దంపతులు

## వైభవంగా రాధా నృత్యనిలయ శివశక్తి సమ్మేళనం

### నయనానందకరంగా పార్వతీ కళ్యాణం భరతనాట్య నృత్యరూపకం



పార్వతీ కళ్యాణం భరతనాట్య నృత్యరూపకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 6 ప్రభాతవార్త :**
ప్రముఖ సాంస్కృతిక సంస్థ రాధా నృత్యనిలయం ఆధ్వర్యంలో రవీంద్రభా రతి ప్రధాన మందిరంలో శుక్రవారం రాత్రి సంస్థ 22వ వార్షికోత్సవ వేడుకల ను పురస్కరించుకొని అధ్యక్షురాలు ఇమ్మడి రాధామోహన్ శిష్యులు వంద మందితో పార్వతీ కళ్యాణం భరతనాట్య నృత్యరూపకాన్ని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా చరణాలవిందానికి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వీణావిద్వాన్ సీతారామయ్య, వేదాంతం రాధేశ్యామ్, వెంపటి శ్రీవల్లిశర్మ, మంజుల శ్రీనివాస్, నీరజలు ముందుగా జ్యోతిప్రకాసనంచేసి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారిని పూర్ణకలశంతో వేదమంత్రాచ్చారణ, వేదపఠనంతో భక్తిశ్రద్ధలతో వేదికపైకి తీసుకువచ్చారు. అనంతరం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారికి సంస్థ, అధ్యక్షురాలు ఇమ్మడి రాధామోహన్ విద్యార్థులచే భరతనాట్య శైలిలో పార్వతీ కళ్యాణంను నృత్య రూపకం; అష్టపుష్పాల నుండి నృత్యపుష్పారణం గీతాలను అలపించారు. అంతేకాక ఇప్పటివరకు ఎవ్వరూ ప్రదర్శించని మంగళంపల్లి బాలమురళీకృష్ణ గరుడధ్వాని థిల్లానా అంశాన్ని మొట్టమొదటిసారి కొరియోగ్రఫీ చేసి భరత నాట్య నృత్యంతో నటరాజుస్వామి పార్వతీదేవిలకు సమర్పించడం విశేషం. చివరిగా గురు ప్రకాష్ శిష్యులచే తబలా వాయిద్యం విచ్చేసిన అశేష ఔత్సా హిక ప్రేక్షకులకు వీనులవిందు కావించారు.

## ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి పాటుపడాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

### -పార్టీలో పని చేసే వారికి పదవులు కల్పిస్తాం : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్,డిసెంబర్ 6 ప్రభాతవార్త:** అలయ ధర్మకర్తలు ఆలయాల అభివృద్ధికి పాటుపడితే భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధి గాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయ ధర్మకర్తల పాల కమండలి ప్రమాణ స్వీకార మహోత్సవ వేడుకలకు ఆయ న ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తూ తన గెలుపుకు సహకరించిన కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటూ నామినేటెడ్ పదవుల్లో వారికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత సుబ్రమణ్య స్వామి పాలక మండలి ఎంపికకు మొదటి సంతకం చేశామన్నారు. సుబ్రమణ్య స్వామి అనుగ్రహం,దీవెనలతోనే ఎమ్మెల్యేగా విజయం సాధి మన్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ బొగ్గారపు దయాకర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఈఓ అరుణ కుమారిల సమక్షంలో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం జరిగింది. ఆలయ ఛైర్మన్‌గా రేపాల వెంకటేశ్వర్లు, ధర్మకర్తలుగా పి.నర్సింగ్‌రావ్, ఎం.రాంమో హన్, కె.పరమేశ్, కె.పద్మజా, పి.బాల్‌రాజ్, పి.శ్రీనివాస్, ఎక్స్ అఫి సియో మెంబర్‌గా టీ.రాజేశ్వర శర్మలు ఎంపికైన ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయ కులు సి. సంతోష్ యాదవ్, చిర్రబోయిన వైష్ణవి, బద్రినా థ్ యాదవ్, తెలుకుంట సతీష్‌గుప్త, చొల్లేటిరమేష్, ము ప్పిడి మధు కర్,సంకి రవిందర్, నాగినేని సరిత, బల్వంత్ రెడ్డి, రంగ రవిందర్, శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.



ఆలయం ధర్మకర్తల ప్రమాణ స్వీకార వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు తదితరులు

## అడ్డగుట్ట కార్పొరేటర్ హౌస్ అరెస్టు



అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 6 ప్రభాతవార్త:**
అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌ను శుక్రవారం తుకారాంగేట్ పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను, కార్పొరేటర్లపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. పోరాటాల ఉద్య మాల నుండి పుట్టిన పార్టీ బిఆర్ఎస్ అన్నారు.

## అంటరానితనాన్ని రూపుమాపాలి : ఎమ్మెల్యే రాజాసింగ్



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అరిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్,బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్‌లు

**గోషామహల్,డిసెంబర్ 6ప్రభాతవార్త:**
భారత రాజ్యాంగపు ఆర్టికల్ 17 ద్వారా సమాజంలో గల అన్ని రూపాల వివక్షను,అంటరానితనాన్ని రూపుమాపాలని భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ పోరాడినట్లు గోషామహల్‌నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్,జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌లు అన్నారు.అంబేద్కర్ వర్ధంతిన్ని పురస్కరించు కుని కట్టెలమండి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వా రు పాల్గొన్నిఅంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివా ళ్ల అర్పించారు.ఈకార్యక్రమంలో రాజ్‌కుమార్,బంగారు సుధీర్‌కుమార్,రఘుకాంబ్లె,రామకృష్ణ,సాయికిరణ్,సందీప్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌టిసి ప్రయాణికులకు 10శాతం డిస్కౌంట్

**అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 6ప్రభాతవార్త:** ఆర్.టి.సి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు టి.జి.ఎస్.ఆర్.టి.సి 10శా తం డిస్కౌంట్‌ను ప్రకటించింది,టి.జి.ఎస్.ఆర్.టి.సి రంగా రెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత ఒక ప్రకటన జారీచేస్తూ మ హాత్మాగాంధీ బస్ స్టేషన్ నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణకు చెందిన ఆర్‌టిసి ఎసి బస్సులు,ఏసి స్లీపర్,ఏసి సీటర్-సీపర్,రాజధాని బస్సులల్లో ప్రయా ణించే ప్రయాణికులకు డిసెంబర్ 6నుంచి అమలోకి వస్తుందని ఆమె తెలిపారు. తెలంగాణానికి చెందిన ఎస్సీ స్లీపర్, సీటర్,రాజధాని,గరుడ బస్సుల్లో ఆంధ్ర ప్రదేశ్‌కు వెళ్లిన ప్రయాణికులకు 10శాతం తగ్గింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రయాణికులకు ఉన్నత స్థాయి ప్రయా ణాన్ని మరింత అందుబాటులో ఉంచ డం,సౌకర్యవంతంగా చేయడమే లక్ష్యంగా అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించు కోవాలన్నారు.ఈ తగ్గింపు టిజిఎస్ఆం టిసి ఏసీబస్సుల ద్వారా అందుబాటులో ఉన్నఅన్ని రూట్లలో వర్తించబడుతుంద న్నారు.టిఎస్ ఆర్‌టిసి వైబ్‌సైట్‌ను ద్వారా తెలుసుకోవచ్చునన్నారు.

## హెచ్‌ఎంటి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



హెచ్‌ఎంటి ఎంప్లాయ్స్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికైన అనంతరం కార్మికులతో కలిసి అభినందనలు తెలుపుతన్న ఎంప్లాయ్స్ యూనియన్ అధ్యక్షులు కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 6 ప్రభాతవార్త :**
హందుస్థాన్ మిషన్‌టూల్స్(హెచ్‌ఎంటి)ఎంప్లాయ్స్ యూని యన్ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ ఘనమెజార్టీతో గెలుపొందారు. శుక్రవారం కంపెనీలో కార్మికుల గుర్తింపు ఎన్నికల్లో ఆయన సమీప హెచ్‌ఎంటి తెలంగాణ యూనియన్ నుండి పోటీచేసిన సుదర్శన్‌రావుపై విజయం సాధించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాటాడుతూ హెచ్‌ఎంటి కార్మికుల సమ స్యల పరిష్కారానికి తనశాయశక్తులా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కులు, బాధ్యతలపై మరింతగా దృష్టికేంద్రీకరించి ఉత్పత్తితో పాటు కార్మికుల న్యాయమైన కోర్కెల సాధనకోసం పోరాడతానని అన్నారు.

### నియోజవర్గంలో బిఆర్ఎస్ జరిపిన అభివృద్ధి శూన్యం : అదం సంతోష్‌కుమార్



ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**సికింద్రాబాద్, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** సీతాఫల్‌మండి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సికిం ద్రాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి అడుగంటిదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి మురికి వాడలా మార్చిందన్నారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో జరుపుతున్న అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్న కారణం గా దాదాపు 5వందల మంది మహిళలకు ఉచితంగా చీరల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జలంధర్‌రెడ్డి, శి ల్పా, అభిషేక్, షకీల్‌ఖాన్, గంటారాజు సాగర్, సందీప్, సతీష్ ఇతర నేతలు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

క్ర.సం.1. నిట్ నం.'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన నం. 11/SE (H)/GHMC/2024-25 తేదీ: 05.12.2024 పనిపేరు : సివిల్ పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో): 141.60 మొత్తం : 01 పనులు. 141.60. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: ప్రారంభ తేదీ: 07.12.2024 సా.04.00గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం : 17.12.2024 మ.3.30గం. అధికారి పేరు, చిరునామా సెల్ నం: సూపరింటెండింగ్ ఇంజనీర్ (హౌసింగ్), GHMC, 900015395. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్ (హౌసింగ్), GHMC.
DIPR.NO. 7578-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 06.12.2024

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం.& తేదీ: 21/DB EE/అల్వాల్ సర్కిల్/GHMC/2024-25 తేదీ: 05.12.2024
పని యొక్క పేరు: సూపర్ లూ స్టార్ డీలక్స్ పోర్టబుల్ మొబైల్ టాయిలెట్స్ యొక్క సరఫరా మరియు స్థాపన. అంచనా మొత్తం: రూ.లక్షలలో: 23.00, ప్రారంభ తేదీ, సమయం: 06.12.2024 మ.12.00గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం : 09.12.2024 మ.2.00గం. EE యొక్క పేరు, చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, GHMC.
DIPR.NO. 7546-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 05.12.2024

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT AT :: KUSHAIGUDA
O.S. NO. 840 OF 2022
BETWEEN:-
Sri. Survi Srinivas Goud ...Plaintiff
AND
Koukuntla Ram Reddy & Others ...Defendants
AND
I.A. NO. 582 OF 2022
IN
O.S. NO. 840 OF 2022
BETWEEN:-
Sri. Survi Srinivas Goud ...Petitioner/Plaintiff
AND
Koukuntla Ram Reddy & Others ...Respondents/Defendants
To,
Smt. Ketha, W/o. Damodar Reddy, D/o. Late Narsimha Reddy, Aged about 42 Years, Occ: Housewife. R/o. H. No 2-62, Ahmedguda Village, Dammaiguda Municipality, Keesara Mandal, Medchal Malkajgiri District.
Please take notice that the Plaintiff filed the above suit against you and four others seeking Perpetual Injunction in respect of the land Adm. Ac. 0.13.75 Gts., in Sy. No. 21/e/A, situated at Ahmedguda Village, Dammaiguda Municipality, Keesara Mandal, Medchal Malkajgiri District and the above said I.A. is filed seeking temporary injunction.
The above said Suit & I.A. is posted for appearance on 03-01-2025 at 10:30 A.M. Kindly make it convenient to appear on the above said date before the above said Honble Court either in person or through counsel, if you fails to appear the Hon'ble Court will decide the matter on merits.
// BY THE ORDER OF COURT //
Sd/-
POLICE VENKAT REDDY
ADVOCATE
COUNSEL FOR PLAINTIFFS
Mobile: 9849923407

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT : HYDERABAD
O.S. No. 4495 OF 2024
BETWEEN:
1. Smt. Sipra Chatterjee
2. Subhashis Chatterjee ...PLAINTIFFS
AND
1. The Mandal Revenue Officer, Asifnagar Mandal, Hyderabad
2. All Concerned ...DEFENDANTS
PUBLIC NOTICE
The Public in General are hereby informed that Smt. Sipra Chatterjee and Subhashis Chatterjee have filed suit for declaring them as legal heirs of Late Mr. Bhowoni Prasad Chatterjee before the Hon'ble IX Junior Civil Judge, City Civil Courts at Hyderabad vide. O.S No. 4495 of 2024. The Hon'ble Court ordered for the paper publication for Defendant No. 2 i.e., All Concerned to appear on 03.01.2025 at 10: 30 AM and that any person or persons interested may appear either in person or through counsel on the above said date and in the failure of attending the matter, the court may pass further order or orders by setting ex-party.
( BY ORDER OF THE COURT )
M. NIRANJAN REDDY,
Advocate,
O/o. 4-87/G3, Datta Sai Residency, Road No.4, Buddha Nagar, Medchal-Malkajgiri District. Mobile No. 7989167523
mniranjanreddy.advocate@gmail.com

IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT JUDGE RANGA REDDY, AT L.B.NAGAR.
O.S.NO. 1004 OF 2022
BETWEEN :
Mr. Karre Sudharshan ...Plaintiffs
Vs
Mr. Karre Narayana And 29 Others ...Defendant
To,
Mr. Karre Narayana and others S/o Pentaiah, Aged 78 years, R/o. Nagireddy Gudem (V), Moinabad (M), Ranga Reddy(D).
Please take notice that the Original Suit filed vide I.A. No. 1071 of 2024 in O.S. No. 1004 of 2022 seeking permission for substitute service of notice to you by way of publishing in newspaper, in the above said suit. The Hon'ble IX Additional District Judge was pleased to allow petition and ordered to publish the notice in the Vartha Daily new paper, and posted the I.A. No.1071 of 2024 in O.S. No. 1004 of 2022 to 11-12-2024 for your appearance.
By order of the court
S. JASBEER SINGH
ADVOCATE
# 5-9-35/2/301, Anand Bhavan Apartment, Basheerbagh, Hyderabad. Cell: 9642161115.

PUBLIC NOTICE
GENERAL PUBLIC HEREBY INFORMED THAT OUR CLIENT BODASU MURALI S/O. BODASU YADAGIRI, AGED ABOUT 41 YEARS, OCC: BUSINESS, R/O. H.No: 3-10-1/236, NEHRU NAGAR, MALLAPUR, KAPRA, HYDERABAD, MEDCHAL-MALKAJGIRI DISTRICT-500062, TELANGANA.
HAS ENTERED INTO AGREEMENT OF SALE WITH NULU RAJKUMAR, SON OF N. PRASADA RAO, ALIAS NULUPOLA RAJKUMAR S/O. N. PRASAD RAO, AGED ABOUT 40 YEARS, Occupation: Pvt. Employee, Resident Of Plot No.196, Jai Jawan Colony, Saket, Kapra, Hyderabad, And Paid The Part consideration, in respect of purchase of Open Plot No. 53 Western Part & Plot No.54 Eastern Part, Total Admeasuring 133.33 Sq. Yards or 111.46 Sq. Mtrs, (Plot No. 53 Western Part Area 66.66 Sq. Yards and Plot No. 54 Eastern part area 66.66 Sq. Yards), in Survey Nos. 110, 111 & 124, Situated at Block No. 2, CHERLAPALLY Village, Kapra Mandal, Under G.H.M.C. Kapra Circle, Medchal-Malkajgiri District.
If any person/persons/Bankers/Financial Institutions having any objection, right claim, title, interest over the said property, the under signed within (1) ONE WEEK from the date of publication of this notice with their claim or objections with supporting material documents, failing which my client shall proceed to obtain sale deed from above named vendor, thereafter no such claim(s) will be entertain and same shall be treated as null and void. Hence this public Notice.
Sd/- N. NARASIMHA RAO, M.A.B.L
Advocate & Notary
Plot No.2170, Saibaba Nagar, 'B' Colony, Kapra, ECIL, Hyderabad-500062
Cell: 9849210938, 9948422606


తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ ఐలయ్య,తదితరులు


ఓల్డ్ మలక్ పేటలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చౌకీ రవికుమార్, బాబు శ్రీనివాస్, మహమ్మద్ షకీల్ తదితరులు


మూసారంబాగ్ డివిజన్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు


అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆనంద్ చౌరస్తాలో విగ్రహానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పూలమాలవేసి నివాళులర్పించిన దృశ్యం


బాగ్ డివిజన్ చింతల బస్తీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్ కుమార్


పెద్దఅంబర్‌పేటలో నివాళులర్పిస్తున్న ఛైర్‌పర్సన్, నాయకులు


రావినారాయణరెడ్డికాలనీ ఫేజ్-3లో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డప్పు వినోద్ కుమార్, తూర్పాటి చిరంజీవి, శ్రీకాంత్, డప్పు వెంకటేష్, డప్పు నరసింహ


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం సీనియర్ నాయకులు ఎండి మహమ్మద్


చింతల్ బస్తీలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న వింజమూరి రాఘవాచారి, కట్ట వెంకటేష్


సైదాబాద్ మెయిన్ రోడ్డులో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి


బాలాపూర్ చౌరస్తాలో అంబేద్కర్‌కు నివాళులరి ్పస్తున్న మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి


మీర్‌పేట్ చౌరస్తాలో అంబేద్కర్ వర ్ధంతిని నిర్వహిస్తున్న పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి తదితరులు


ఉప్పల్‌లో డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు


హబ్సిగూడలో డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

# ఘనంగా అంబేద్కర్‌కు నివాళులు

## పార్క్‌లో అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే


టీచర్స్ కాలనీ ఫేస్ 1.పార్క్‌లో కాలనివాసులతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. డిసెంబరు. 6.ప్రభాతవార్త.**
బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేస్.1 నార్త్ పార్కు పెద్ద పార్క్ నందు జరగబోయే అభివృద్ధి పనుల నిమిత్తం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ దాదాపుగా ఆరు వేల గజాల స్థలంలో వాకింగ్ ట్రాక్,అందమైన పూల మొక్కలతో పార్కు సుందరికారణ,ఓపెన్ జిమ్స్ నిర్మించడం జరుగుతుంది అని తెలిపారు.గతంలో కొందరు ఇట్టి స్థలంలో పచ్చదనం పేరుతో పార్క్ వొద్దు అని అడ్డుకొని కోర్టు నందు కేసు వేయడం జరిగింది.దాంతో కొన్ని సంవత్సరాలుగా కోర్టు నందు పెండింగ్ ఉన్న నేపథ్యంలో ఎట్టకేలకు ప్రస్తుతం కోర్టు తీర్పు కాలనీవాసులకు అనుకూలంగా రావడం జరిగింది.అతి త్వరలోనే పార్క్ సుందరికారణ పనులు ప్రారంభం కావడం జరుగుతుంది అని తెలిపారు.దానిలో భాగంగా రెండు,మూడు రోజుల్లో పనులు ప్రారంభం చేయాలని అధికారులకు ఆదేశించారు.కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,ఫేస్.1 నార్త్ అధ్యక్షులు భూపాల్ రెడ్డి,సామ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
**: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**తుర్కయంజాల్ డిసెంబర్ 6 ప్రభాతవార్త:**
తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి శుక్రవారం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుర్కయాంజల్ మున్సిపాలిటీ లో 1, 8, 13, 15, 17, 19 వార్డులో 2 కోట్ల 64 లక్షల రూపాయలతో అనేక అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు అదేవిధంగా పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజి పనులను పూర్తి చేసి వాటిని ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో మరికొన్ని సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో తుర్కయాంజల్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాం రెడ్డి, వై చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, టి పి సి సి సభ్యులు కాకుమాను సునీల్, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్త కుర్మ మంగమ్మ శివ కుమార్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, కౌన్సిలర్లు నక్క శివలింగం గౌడ్, వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, నారని కవిత శేఖర్ గౌడ్, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, కమిషనర్ అమరేందర్ రెడ్డి, డీ ఈ బిక్షపతి, ఏ ఈ చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు మరియు పుర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : సురేందర్ రెడ్డి


సమావేశంలో ప్రసంగిస్తున్న సందడి సురేందర్ రెడ్డి

**మలక్ పేట ,డిసెంబరు 6, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. మోసపూరితమైన వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను నిరసిస్తూ మలక్ పేట లో బిజెపి నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సలీం నగర్ లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ గ్యారంటీల గారడీతో ఆరు అబద్ధాలు, 66 మోసాలతో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, సంవత్సరం పాలనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గ్యారెంటీలలో ఒక్క గ్యారంటీని కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. అవినీతిలో కేసీఆర్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మించిపోయిందని అన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రధాని మోడీ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి,మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జి, డివిజన్ అధ్యక్షులు కొప్పుల దినేష్, నాయకులు గౌర దేవేం దర్, రమేష్ రెడ్డి, సురేందర్ బొక్క మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు


పోలీసులు అరెస్టు చేసిన సామ సుందర్‌రెడ్డి, కొరుడు భూమేశ్వర్

**సైదాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** మాజీ మంత్రి హరీష్‌రావు అరెస్టును నిరసిస్తూ బిఆర్ఎస్ అగ్రనాయకత్వం శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు ఇవ్వడంతో సైదాబాద్ పోలీసులు యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి సామ సుందర్‌రెడ్డి, హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొరుడు భూమేశ్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ సర్కారు ప్రజల స్వేచ్ఛను హరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేయడమేంటని వారు ప్రశ్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మెట్టు భాస్కర్‌రెడ్డి, పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, పొదిళ్ల శ్రీధర్, కావేటి ధర్మరాజులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం : కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సింగరేణి కాలనీలో నగరిగారి దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ల చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో అయిదు గ్యారంటీలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోట్ల లడ్డు పటేల్, వరలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

## సంవత్సరాల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం
**: కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్**


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** 30 సంవత్సరాల సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరించామని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పేర్కొన్నారు. నాచారం నాచారం ఓల్డ్ విలేజ్లో రూ. 54 లక్షల రూపాయలు వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డితో కలిసి కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాచారంలో డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ప్రణాళికా బద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. నాచారం ఓల్డ్ విలేజ్ కు ఎందరో ప్రజా ప్రతినిధులు వచ్చారు కానీ భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేయించలేకపోయారు అలాంటిది కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ శేకర్ ప్రత్యేక చొరవ తీసుకొని సుమారు కోటి రూపాయలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేయించినందుకు అలాగే మంచినీటి సమస్యలు లో ప్రెషర్ సమస్యలు అన్నింటిని పరిష్కరించడంతో పాటు రూ. 54 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు కూడా వేయిస్తున్నందుకు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఈ బాలకృష్ణ,ఏఈ. కీర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ స్థానిక బారాసా నాయకులు కార్యకర్తలు మరియు నాచారం ఓల్డ్ విలేజ్ ప్రజలు మరియు సీనియర్ సిటిజన్స్ పాల్గొనడం జరిగింది.

## అక్రమ నిర్మాణాలను కూల్చనందుకు నిరసనగా కార్పొరేటర్ ధర్నా



కార్పొరేషన్ ముందు బైఠాయించి ధర్నా చేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి రాజు

**సరూర్‌నగర్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని జనప్రియామహానగర్ సెల్లార్లలో అక్రమ నిర్మాణాలను కార్పొరేషన్ పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ స్థానిక 31వ డివిజన్ కార్పొరేటర్ పాలమూరి విజయలక్ష్మి రాజు ధర్నాకు దిగారు. శుక్రవారం ఆమె సింగిల్‌గా కార్పొరేషన్ కార్యాలయం గేటు ముందు బైఠాయించి ఆందోళన చేశారు. జనప్రియా మహానగర్‌లో సెల్లార్లలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తాము ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ధర్నాకు పూనుకున్నానని ఆమె వెల్లడించారు.

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హౌజ్ అరెస్ట్


ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని హౌజ్ అరెస్ట్ చేసిన రాచకొండ పోలీసులు దృశ్యం.

**ఉప్పల్, డిసెంబరు 6 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శుక్రవారం పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్‌లు చేయడంతో ఇందులో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కూడా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ మరోవైపు అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటిస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, శివ, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నల్ల మందు విక్రయిస్తున్న ఒక వ్యక్తి అరెస్ట్



**ఉప్పల్, డిసెంబరు 6 ప్రభాతవార్త :** ఇతర రాష్ట్రాల నుంచి నల్ల మందు తెచ్చి నగరంలో విక్రయిస్తున్న ఒక వ్యక్తిని రాచకొండ ఎస్ఒటి పోలీసులు అదుపులోకి తీసుకుని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు ఒక వ్యక్తిని అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన బాదర్ రామ్ అలియాస్ బహదూర్ గుజార్ (32) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఉప్పల్ గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతనితోపాటు, లక్ష్మణ్ మాలక్ అనే వ్యక్తి కలిసి నల్ల మందు తెచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. బాదర్ రామ్ 2014లో నగరానికి వలస వచ్చి టైలర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. కుటుంబ ఖర్చులు పెరగడంతో రెండు నెలల నుంచి పని మానేసి స్వగ్రామానికి చేరుకున్నట్లు తెలిపారు. నగరంలో నల్ల మందుకు గిరాకి ఉన్నందున లక్ష్మణ్ మాలిక్ వద్ద లభించే నల్ల మందును తన స్వస్థలం నుంచి కొనుగోలు చేసి అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నాడని తెలిపారు. అక్రమ మార్గాలలో సులభంగా డబ్బులు సంపాధించాలని నిందితుడు ప్లాన్ చేసి రాజస్థాన్ నుంచి లక్ష్మణ్‌మాలిక్ నుంచి కేజీ నల్ల మందు రూ.50వేలకు కొనుగోలు చేసి నగరానికి తీసుకుని వచ్చి పది గ్రాములు రూ.400లకు విక్రయిస్తున్నాడని తెలిపారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు ఎస్ఒటి, ఉప్పల్ పోలీసులు ఈనెల 4వ తేదిన అతని ఇంటిపై దాడి చేసి అతని వద్ద నల్ల మందు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నల్ల మందు కొనుగోలు చేసిన వారిని కూడా పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి కేజీ నల్ల మందు, హోండా యాక్టివా, మెబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వడ్డెరలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం జరగాలి



**తుర్కయంజాల్ డిసెంబర్ 6 ప్రభాతవార్త :** తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు వారి పిలుపు మేరకు వడ్డెర ఎస్టి సాధనకై ఇబ్రహీంపట్నం నియోజవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని వారి నివాసంలో రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు వరికుప్పల శ్రీశైలం, రాష్ట్ర కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బోదాస్ నర్సింహ వారు వడ్డెర నాయకులతో కలిసి ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అణగారిన తెలంగాణ వడ్డెర గత 44 సంవత్సరాలుగా ఎస్టీ డిమాండ్ కోసం పోరాడుతున్నామని. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వారు వడ్డెర కులాన్ని ఎస్టీ లో చేర్పిస్తామని బహిరంగ సభలో ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ , వడ్డెర కులాన్ని ఎస్టీ జాబి తాలో చేరుస్తామని బహిరంగ సభలో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ 2023 మేనిఫెస్టోలో వడ్డెర కులానికి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి సరిపడా నిధులు ఇస్తానని మేనిఫెస్టోలో పొందుపరిచారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వడ్డెర కార్పొరే షన్ ఏర్పాటు చేయాలని కోరుతూ. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వడ్డెర కులాన్ని ఎస్టీలుగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వరికుప్పల సుధాకర్, గండికోట వెంకటేష్, ఇరగదీన్ల నరసింహ, విడగొట్టి సురేష్ స్వామి, గండికోట స త్యం గండికోట చంద్రయ్య నాన్కంపేట నరసింహ, దేరంగుల జంగయ్య, గద్ద మల్లయ్య, వరికుప్పల, శ్రీనివాస్, గండికోట వెంకటేష్, వరికుప్పల చంద్రయ్య, గండికోట శ్రీరామ్, వరికుప్పల సాయి, శ్రీను. వెంకటేష్ ,నరసింహ, ఎల్లయ్య చంద్రయ్య, గణేష్. వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## రేవంత్‌రెడ్డి సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడు : ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ

**ఎల్‌బినగర్, డిసెంబరు 6 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ ఆరభించారు. మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, అక్రమ అరెస్టులకు నిరసనగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా నల్లరిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులను, ఎమ్మెల్యేలను ,ఎమ్మెల్సీలను హౌస్ అరెస్ట్ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచిబుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్‌కి వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు పరాకాష్టగా నిలుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల కనుసన్నలోనే నడుస్తున్నదని రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నాయకులను గృహ నిర్బంధం చేసి పోలీసుల రక్షణలో ప్రభుత్వం నడుపుతున్నారన్నారు.ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామాచారి, కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, జైశ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, ముచ్చితల జగన్, బాలుశ్రీ , పేదిరా శంకర్, నిరంజన్, శివనాయక్, శ్రీకాంత్‌గౌడ్, బండారి మల్లేష్, మమ్ము పాల్గొన్నారు.

## మహేశ్వరం అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ సారథిగా వల్లపు సుభాన్ యాదవ్



**సరూర్‌నగర్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో కీలకమైన మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామానికి చెందిన సీనియర్ యూత్ కాంగ్రెస్ నాయకుడు వల్లపు సుభాన్ యాదవ్ ఎన్నికయ్యారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పని చేస్తున్న సుభాన్ యాదవ్ ఆ పదవికి నియమితులైనప్పటి నుండి చురుకుగా పని చేస్తూ పార్టీలో అందరి మన్నలను పొందారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బాగానే పని చేశారు. అయితే తెలంగాణవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో యువజన కాంగ్రెస్ అధ్యక్షుల భర్తీ కోసం ప్రాంతాల వారీగా పార్టీ అధిష్టాన వర్గం సంస్థాగత ఎన్నికలను నిర్వహించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి యువజన కాంగ్రెస్ సారథ్యాన్ని ఆశించిన సుభాన్ యాదవ్ అధ్యక్ష ఎన్నికల బరిలో దిగి పోటీ చేశారు. ఈ మేరకు ప్రత్యర్థులుగా నిలిచిన వారిలో జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన ఫాజిల్‌పై 2050 ఓట్ల భారీ అధిక్యతతో ఘన విజయం సాధించి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు.

**మహేశ్వరంలో కాంగ్రెస్ పతాకాన్ని ఎగురవేయడమే లక్ష్యం**
మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చి పార్టీ పతాకాన్ని రెపరెపలాడించడమే తన లక్ష్యమని వల్లపు సుభాన్ యాదవ్ స్పష్టం చేశారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను అధ్యక్షునిగా ఎన్నుకున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు అదే విధంగా సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి విశ్వాసాన్ని నిలబెట్టుకొని పని చేస్తానని సుభాన్ వెల్లడించారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన


కార్యక్రమంలో పాల్గొన్న చింతల అరుణసురేందర్‌యాదవ్

**ఎల్‌బినగర్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలోని చాణక్య హైస్కూల్‌లో సైన్సు ఫెయిర్ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను కనబరచడానికి సైన్స్‌ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీసేందుకు పాఠశాల నిర్వాహకులు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధాల ఐలయ్య, శివకుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.